క్లుప్తంగా

ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గ శ్రీ యోగి వేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని పల్నాడు రోడ్డులోని సేవా సమితి కార్యాలయం వద్ద యోగి వేమన జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా యోగి వేమన, వైఎస్సార్ చిత్రపటాలకు సేవా సమితి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా సమితి అధ్యక్షులు ఆరె శివారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విశ్వకవి యోగి వేమన జయంతిని ప్రతి సంవత్సరం జనవరి 19న అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని అన్నారు. అలాగే రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాకు యోగి వేమన పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పులిహోర పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, ఉపాధ్యక్షులు కొణతం ఎరుకలరెడ్డి, లేళ్ల అంజిరెడ్డి, వజ్రాల కృష్ణారెడ్డి, తుమ్మా రామకృష్ణారెడ్డి, కోశాధికారి రామిరెడ్డి, మాలపాటి భాస్కరరెడ్డి, బిక్కం వెంకటనారాయణరెడ్డి, మూలె వెంకటేశ్వరరెడ్డి, కొత్త కృష్ణారెడ్డి, నక్కా బ్రహ్మారెడ్డి, కొత్త సుందరరెడ్డి, కర్నాటి చెన్నకేశవరెడ్డి, తుమ్మా వెంకటరెడ్డిలతో పాటు పలువురు కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాల్లో గ్రామోదయం

బొల్లాపల్లి : మండలంలోని మూగచింతలపాలెం, బొల్లాపల్లిలో గ్రామోదయం శుక్రవారం నిర్వహించారు. రక్త హీనత ఉన్న బొల్లాపల్లి బీసీ కాలనీలో రక్త హీనత ఉన్న విద్యార్థినిలను గుర్తించి తల్లిదండ్రులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలను అరికట్టడం పై అవగాహన కల్పించారు. పీడబ్ల్యూడీ ఓటర్లు, ఓటు నమోదుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండ ఓటు హక్కు వినియోగించుకునే విదంగా ప్రభుత్వం సౌకర్యాలు కల్పించిందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తిరాములు, తహసీల్దార్ ఎస్ దుర్గేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీఓ బి అరుణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీ బాషా, ఎంఈఓ1 సయ్యద్ జప్రుల్లా, ఎంఈఓ2 కె పార్వతి, సూపర్‌వైజర్లు వి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 18 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. కోటప్పకొండ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా 18 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వెంకటరెడ్డిని అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఈనెల 20వ తేదీ నుంచి 26 తేదీ వరకు ధర్మప్రచార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి శుక్రవారం తెలిపారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం, హిందూ ధర్మాన్ని మరింతగా వ్యాప్తిచేసేందుకు, ఆలయ సంస్కృతిని ప్రజలకు తెలియజేసేందుకు ధర్మప్రచారాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వారం రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం 6గంటల నుంచి 7.30గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ధర్మప్రచార ప్రవచనలు ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

యడ్లపాడు: కారును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టిన ప్రమాదంలో కారులోని వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన 16వ నంబర్ జాతీయ రహదారిపై యడ్లపాడు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రేపల్లెకు చెందిన సుఖవాసి భానుప్రకాష్, సాంబశివరావు, హేమకుమార్, విజయవాడకు చెందిన శ్రీనాథ్ బంధువులు. అందరూ కారులో విజయవాడ నుంచి తిమ్మాపురంలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. కారు యడ్లపాడు ఎస్ఎస్ఎల్ నూలుమిల్లు వద్దకు రాగానే కారును వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ప్రమాదంలో కారు వెనుక భాగంలో కూర్చున్న భానుప్రకాష్, హేమకుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా భానుప్రకాష్ (43) మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య రాధిక, కుమార్తె ఉన్నారు. డ్రైవర్ శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుల గణన సర్వే ప్రారంభం

శావల్యాపురం: కుల గణన ప్రక్రియలో వలంటీర్లు సచివాలయ ఉద్యోగులు కీలకపాత్ర పోషించి సర్వే నూరుశాతం అయ్యేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తలూరు గ్రామంలో గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా కుల గణన సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

విజయవాడకు భారీగా తరలిన అభిమానులు

నరసరావుపేట: విజయవాడలోని స్వరాజ్య మైదానంలో శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు నియోజకవర్గం నుంచి వందలాదిమంది బయలుదేరి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు అక్కడకు తరలివెళ్లేందుకు ప్రభుత్వం నియోజకవర్గానికి 33 ఆర్టీసీ బస్సుల చొప్పున 231 బస్సులను ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో ఆ బస్సుల ద్వారా నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు, అంబేడ్కర్ అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి అంబేడ్కర్ స్మృతివనంలో ఏర్పాటుచేసిన మ్యూజియం సందర్శించారు.

సామాజిక సమత సంకల్ప సభకు తరలివెళ్లిన మండలవాసులు

బొల్లాపల్లి: శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి సామాజిక సమత సంకల్ప సభకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బారీగ తరలి వెళ్లారని మండల జెడ్పీటీసీ రామావతు బీమీబాయి కృష్ణా నాయక్ తెలిపారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్క రణ ముఖ్యమంత్రి చేతుల మీదుగ జరగనుంది. ఈ సందర్భంగా మండలం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐదు సర్వీసులకు తరలివెళ్లారని తెలిపారు.

వినుకొండ నుంచి...

వినుకొండ(నూజెండ్ల): విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భారీ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ, సామాజిక సమత సంకల్ప సభ కోసం వినుకొండ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బస్సుల్లో ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంతో పాటు పలు గ్రామాల నుంచి మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్ తదితరుల ఆధ్వర్యంలో అభిమానులు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు.



నరసరావుపేట నుంచి బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

నాదెండ్ల నుంచి...

నాదెండ్ల: విజయవాడ నడిబొడ్డున ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం విగ్రహావిష్కరణ, సామాజిక సమతా సంకల్ప సభకు మండలం నుండి వైసీపీ శ్రేణులు, దళిత నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, జేఏసీ కన్వీనర్ అల్లడి రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుంచి బస్సులు, వాహనాల్లో తరలివెళ్లారు. వాహనాలకు పార్టీ జెండాలు కట్టుకుని, నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఫ్లెక్సీలు, డోర్ స్టిక్కర్లతో జయహో జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ ఉత్సాహంగా వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో నాదెండ్ల, గణపవరం సొసైటీ అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, జెట్టి బొల్లయ్య, వీరాస్వామి, పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, గద్దె బ్రదర్స్ ఉన్నారు.

భావితరాలకు స్ఫూర్తి...

ఈ సందర్భంగా మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ భావితరాలకు స్ఫూర్తి భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం అని పేర్కొన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తు న్నారని తెలిపారు. సమాజంలో అసమానతలు తొలిగించేందుకు సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషి శ్లాఘనీయమన్నారు. అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని ఆకాశాన్ని ముద్దాడేంత ఎత్తున నిర్మించడం ఎంతో గర్వకారణమని, ప్రపంచంలోనే భారీ కాంస్య విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పా టు చేయడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

మార్మోగిన జై భీమ్.. జై జగన్ నినాదాలు



చిలకలూరిపేటలో బస్సులను ప్రారంభిస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: జై భీమ్... జై జగన్... జై మల్లెల నినాదాలతో నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణం మారుమోగాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయవాడలో ప్రపంచంలోని ఎత్తైన భారత రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ, సామాజిక సమతా సంకల్ప సభకు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణు లు శుక్రవారం పెద్ద ఎత్తున తరలి వెళ్లాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా బస్సు లు, కార్లలో ర్యాలీగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు కులమతాలకు అతీతంగా ఉత్సాహంగా కదలివెళ్లారు. మేమంతా మీవెంటే.. మా జెండా వైఎస్సార్ సీపీ ఎజెండా.. మానమ్మకం జగన్ అంటూ కార్యకర్తలు నినదించారు. యడ్లపాడు మండలం బోయపాలెంలోని పార్వతీదేవి అమ్మవారి ఆలయం వద్ద ర్యాలీ మల్లెల రాజేష్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గం నలుమూలలా నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు బస్సుల్లో, కార్లలో జాతీయ రహదారిపై జై భీమ్ నినాదాలతో సందడి చేశారు.



బొల్లాపల్లి నుంచి తరలివెళ్తున్న వాహనాలతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



నూజెండ్ల మండలం నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



నాదెండ్ల నుంచి విజయవాడకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

వైఎస్సార్ సీపీతో ఆర్యవైశ్యులకు అండ

పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావును అభినందించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ఆర్యవైశ్య సంఘీయులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘ పెద్దలచే పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించబడిన చిన్ని వెంకట శ్రీనివాసరావు శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గోపిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసరావు పట్టణ అధ్యక్షుడిగా నియమించటం చాలా సంతోషకరమైన విషయమంటూ అభినందించారు. గత పదేళ్లగా సంక్రాంతి సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నాడన్నారు. ఇంకా సంఘంచే సేవలు విస్తృతం కావాలని, ఆర్యవైశ్య సమస్యలు పెద్దలతో కలిసి పరిష్కరించాలని కోరారు. సంఘ అభివృద్ధికి మిగతా కమిటీని కూడా ఏర్పాటు చేసుకొని చక్కగా సమాజ సేవలో పాల్గొనాలని సూచించారు. వారికి కావాల్సిన సహాయ సహకారాలు ప్రభుత్వ పరంగా అందజేస్తామని వెల్లడించారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అధికారి మిట్టపల్లి రమేష్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి కిషోర్‌బాబు, ఆర్యవైశ్య నాయకులు నిడమానూరి సురేంద్ర, ప్రవల్లికా సత్యం, వీఎస్పీ సాంబశివరావు, భవిరిశెట్టి నాగేశ్వరరావు, మద్ది రామబ్రహ్మానందరావు, చేగు వెంకటేశ్వరరావు, అత్తులూరి శ్రీకృష్ణ అభినందించారు.



ఎమ్మెల్యే గోపిరెడ్డిని సన్మానించిన ఆర్యవైశ్య నాయకులు

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కారుమంచి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రాంబాబు

శావల్యాపురం: ఎస్‌బీఐ బ్యాంకు సేవలను బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కారుమంచి ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ కె.రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కారుమంచి ఎస్‌బీఐ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో బాధిత కుటుంబ సభ్యురాలకు రూ. 2 లక్షల చెక్కు అందజేశారు. ఈసందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ మండలంలోని గుంటుపాలెం గ్రామానికి చెందిన పాములపాటి వెంకటేశ్వర్లు గుండెపోటుతో గత రెండు నెలల క్రితం మృతి చెందాడు. ఈక్రమంలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో రూ, 430 రూపాయాలు ప్రీమియం చెల్లించగా క్రమంలో సాధారణ మృతిలో భాగంగా మృతుడు భార్య నామిని పాములపాటి సుబ్బులుకు రూ. 2 లక్షల చెక్కును అందజేశామన్నారు. గతంలో ఇలాంటి క్లయిమ్స్ ఆరు మంది బాధిత కుటుంబాలకు ఎస్‌బీఐ బ్యాంకు తరుపున అందజేశామన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులు తప్పనిసరిగా బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు నగదు అధికారి లక్ష్మణరావు, బ్యాంకు సిబ్బంది జాన్‌సైదులు, కరిముల్లా పాల్గొన్నారు.



నామినికు చెక్కును అందజేస్తున్న మేనేజరు రాంబాబు

గ్రామస్తులకు ఆరోగ్య రక్ష

వేర్వేరు ప్రాంతాల్లో కొనసాగిన జగనన్న ఆరోగ్య సురక్ష

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 498 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. వీరిలో 243 మంది మహిళలు కాగా 223 మంది పురుషులు ఉన్నారు. పిల్లలు 26 మంది మరో 6 విద్యార్థులకు అవసరమైన పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు తహసీల్దార్ అంకారావు పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులకు అందుతున్న సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బందికి, డాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హర్షవర్ధన్, డాక్టర్ ఎస్. సాయిబాబు, డాక్టర్ జగన్ నరసింహా రెడ్డి, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొని సేవలు అందించారు.

నాదెండ్లలో 457 మందికి..

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి బీజే బెన్నీ, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావులు ప్రారంభించారు. గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత, స్పెషలిస్ట్ వైద్యులు సాయిసింధు, సంఘవి పాల్గొని 457 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి బెన్నీ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్య, వైద్య ఆరోగ్య రంగాల్లో ప్రజలకు విశేషమైన సేవలందిస్తుందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పేదవాడికి ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారుతీ బాబు, ఎంఈవో ఆంజనేయులు, ఏపీఎం సాంబశివరావు, నాయకులు కోనేటి నాగయ్య, కె రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, వీవోఏలు, ఆశలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా జేఏఎస్

బొల్లాపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడతలో మండలంలోని గుమ్మనంపాడు సచివాలయంలో మెగా వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఎం.సాయివినూత్న, కంటి వైద్యులు చాంద్ బాషా, ప్రత్యేక వైద్యులు కె.ఎల్.ఎస్.రావు, సుధాస్రవంతిలు వైద్యశిబిరంలో వైద్యసేవలు అందజేశారు. ఈ వైద్యశిబిరంలో 380 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వీరిలో 75 మందికి కంటి వైద్య చికిత్సలు అందజేసి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని ఎంపీపీ బత్తి రాములు ప్రారంభించి మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందజేయడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వైద్యసేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కటారి పుల్లమ్మ తిప్పయ్య, ఎంపీటీసీ వి.వెంకటరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీ బాషా, సచివాలయం సిబ్బంది, ఎ.సాంబిరెడ్డి, వి.చిన్నమస్తాన్‌రెడ్డి,వి.సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.



నాదెండ్లలో వృద్ధునికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



గోగులపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయిబాబు



గోగులపాడులో శిబిరాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు



గుమ్మనంపాడులో జేఏఎస్‌లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



గోగులపాడులో కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు

చిలకలూరిపేటటౌన్: ఆడుదాం ఆంధ్రలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్, ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్, వేలూరు జెడ్పీహైస్కూల్, పురుషోత్తమపట్నంలో క్రీడా ప్రాంగణంలో క్రికెట్ విభాగంలో పోటీలు కొనసాగాయి. బాలుర విభాగంలో మొత్తం 30 టీంలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో డైక్‌మెన్ నగర్-1, సుభానీ నగర్-1, బొప్పూడి, కావూరు, యానాదికాలనీ, గంగన్నపాలెం, మద్దినగర్, జాకీర్‌హుస్సేన్ వీధి, తూర్పు మాలపల్లి, వేలూరు, గణపవరం-1, పోతవరం, గోవిందపురం, మురికిపూడి-2, పురుషోత్తమపట్నం 2 టీంలు గెలుపొందాయి. హోరాహోరీగా టీంలు తలపడ్డాయి.

శావల్యాపురం మండలంలో..

శావల్యాపురం: ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిసినట్లు ఎంపీడీవో పేరమీనా సీతారామయ్య తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల స్థాయిలో వాలీబాల్ క్రీడా పోటీల్లో మహిళలు-శావల్యాపురం, పురుషులు విభాగంలో-శావల్యాపురం, క్రికెట్ పోటీల్లో-పురుషులు వేల్పూరు-1, మహిళలు విభాగంలో-శావల్యాపురం జట్టు, ఖోఖో క్రీడా విభాగంలో పురుషులు-వేల్పూరు-1, మహిళలు-మతుకుమల్లి, జట్టు, కబడ్డీ క్రీడా విభాగంలో పురుషులు వేల్పూరు-2, మహిళలు -శావల్యాపురం, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలో రెండు స్థానాలు మతుకుమల్లి జట్లు కైవసం చేసుకున్నాయి. గెలిపొందిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వినుకొండ పట్టణంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలు ఈనెల 24 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. నియోజకరవర్గ స్థాయిలో పాల్గొనే క్రీడా కారులకు ప్రభుత్వ పరంగా క్రీడా సామాగ్రి అందజేయనునన్నట్లు చెప్పారు. ఆయనతో పాటు వ్యాయమా ఉపాధ్యాయులు రాగుల రాధాకృష్ణమూర్తి, పి.వాణి, కాకుమాను రాజేష్. ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.



వేలూరు, గణపవరం జట్ల మధ్య హోరాహోరీగా కొనసాగుతున్న దృశ్యం

22 నుంచి ఉచిత యోగ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ సోమవారం నుంచి 174వ ఉచిత యోగశిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు యోగాచార్యులు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు నెల రోజుల పాటు యోగశిక్షణ ఉంటుందన్నారు. శిబిరంలో 42 యోగ భంగిమలు, ప్రాణాయామం, ఆహార నియమాలు, ధ్యానం, సూర్య నమస్కారాలు భోధించనున్నట్టు వివరించారు. నేటి పోటీ ప్రపంచంలో బీపీ, షుగర్ వ్యాధి బారిన పడుతున్న వారు రోజురోజుకు పెరిగిపోతున్నారని, వారందరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగ చక్కటి మార్గమని తెలిపారు. వివరాలకు 9490846333, 9491665733 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

21న వేల్పూరులో మెగా కంటి వైద్య శిబిరం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం శివాలయంలో కీ.శే గోపు శ్రీరాములు, కాకాని నాగేంద్రం, కాకాని శ్రీనివాసరావుల జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం ఈనెల 21న మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు కమిటీ ప్రతినిధి కాకాని అంజిబాబు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెదకాకాని శంకర కంటి వైద్యశాల జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవరమైన వారి ఉచితంగా బస్ సౌకర్యంతో పాటు ఆపరేషన్ భోజన వసతి కల్పిస్తామన్నారు. శిబిరంలో పాల్గొనే వారందరు ఆధార్, ఓటరు కార్డు జిరాక్స్‌లతో సెల్ నంబరుతో తప్పనిసరిగా తీసుకొని రావలాన్నారు. కంటి శుక్లముల ఆపరేషన్లు చేయించుకునే వారందరు ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యులు ధ్రువీకరణ పత్రాలతో శిబిరంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9492081140 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా కందులు కొనుగోలు

ఈపూరు : జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కందులను కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయధికారి రామారావు తెలిపారు. నాఫెడ్ నిర్ణయించిన ధరల ప్రకారం రూ.9232.35లకు క్వింటా కందులను కొనుగోలు చేస్తామని, రైతులు ఎన్ని క్వింటాళ్ల అయినా అమ్ముకోవచ్చని తెలిపారు.